సాక్షి
కుమురం భీం

I

శుక్రవారం । 11 । అక్టోబర్ । 2024



కాగజ్‌నగర్ రూరల్: బతుకమ్మతో చిన్నారి

మళ్లీ రావమ్మా.. గౌరమ్మ



బెజ్జూర్: బతుకమ్మతో చిన్నారి



జిల్లా కేంద్రంలోని సంఘసేవా దుర్గామండలి వద్ద సంబురాలు

- జిల్లావ్యాప్తంగా ఘనంగా 'సద్దుల' సంబురం
- ఆటపాటలతో మార్మోగిన పట్టణాలు, పల్లెలు
- సమీపంలోని చెరువులు, వాగుల్లో బతుకమ్మల నిమజ్జనం

ఆసిఫాబాద్/ఆసిఫాబాద్‌అర్బన్: 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో, రామ రామ రామ ఉయ్యాలో.. రామనే శ్రీరామ ఉయ్యాలో.. హరిహరి దేవ ఉయ్యాలో.. హరియో బ్రహ్మదేవ ఉయ్యాలో.. అంటూ బతుకమ్మ పాటలు హోరెత్తాయి. రంగురంగులు, తీరొక్క పూలతో మహిళలు బతుకమ్మలు పేర్చారు. ఆలయాలు, కూడళ్ల వద్ద గురువారం అర్ధరాత్రి వరకు పాటలతో హుషారుగా ఆడిపాడారు. మహిళలు సంప్రదాయ దుస్తులు, ఏకరూప వస్త్రాలంకరణతో గౌరమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రకాల నైవేద్యాలు సమర్పించారు. జిల్లా కేంద్రంలోని శివకేశవమందిర్, బాపూనగర్, బజార్‌వాడి, జన్కాపూర్, సందీప్‌నగర్, రాజంపేట, తారకరామానగర్‌లో చిన్నా పెద్దా తేడా లేకుండా బతుకమ్మ ఆడారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పెద్దవాగు, జన్కాపూర్ వాగు వద్ద ఏర్పాట్లు ఏర్పాట్లు చేయగా.. డీజే చప్పుళ్లు, బ్యాండు మేళాలతో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.



రెబ్బెన: గోలేటిలోని సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో బతుకమ్మ సంబురాలు



జిల్లా కేంద్రంలో బతుకమ్మలతో..



దహెగాం: బతుకమ్మ ఆడుతున్న మహిళలు

దుర్గామాతగా అమ్మవారు



రెబ్బెన(ఆసిఫాబాద్): శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా రెబ్బెన మండలం ఇందిరానగర్‌లోని కనక దుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో అమ్మవారు గురువారం భక్తులకు దుర్గామాత అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారికి భక్తులు హారతులిచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

విజయ్ నోట.. బతుకమ్మ పాట

- యూట్యూబ్‌లో గ్రామీణ యువకుడి పాటలు
- అంగవైకల్యం ఉన్నా.. గాయకుడిగా రాణింపు
- మాతృభాష మరాఠీ అయినా తెలుగుపై పట్టు
- లక్షల్లో వ్యూస్‌తో దూసుకుపోతున్న వైనం



స్టూడియోలో పాట పాడుతున్న విజయ్

కౌటాల(సిర్పూర్): తెలంగాణలో బతుకమ్మ పండుగ వస్తోందంటే చాలు పాటల సందడి కనిపిస్తోంది. ఏటా కొత్త పాటలు కూడా విడదలవుతూనే ఉంటాయి. పండగ సమయంలో తొమ్మిది రోజుల పాటు ఈ పాటలతో వీధులన్నీ మార్మోగుతుంటాయి. తన పాట కూడా బతుకమ్మ సంబురాల్లో మార్మోగాలనే ఉద్దేశంతో గ్రామీణ ప్రాంతానికి చెందిన యువకుడు బడిగే విజయ్ బతుకమ్మ, జానపద, గ్రామీణ పాటలతో రాణిస్తున్నాడు. మాతృభాష మరాఠీ, హిందీతో పాటల ప్రస్థానాన్ని ప్రారంభించి తెలుగు పాటలతో ఆకట్టుకున్నాడు. యూట్యూబ్‌లో వీడియోలు అప్‌లోడ్ చేస్తూ లక్షల వ్యూస్‌తో దూసుకుపోతున్నాడు.

అంగవైకల్యం ఉన్నా..

కౌటాల మండలంలో మారుమూల ప్రాంతం తాటిపల్లి. మహారాష్ట్రకు సరిహద్దున ఈ గ్రామం ఉండటంతో స్థానికంగా అందరూ మరాఠీ మాట్లాడుతారు. గ్రామానికి చెందిన బడిగే దామాజీ, నిర్మలాబాయి దంపతుల కుమారుడు బడిగే విజయ్‌కి పుట్టుకతో అంగవైకల్యం ఉంది. ఎడమ కాలు సక్రమంగా లేకపోవడంతో నడకకు ఇబ్బందులు ఎదురవుతుంటాయి. విజయ్ పాఠశాల స్థాయిలోనే పాటలు పాడేవాడు. విజయ్‌ది సైతం మాతృభాష మరాఠీ కావడంతో గ్రామంలోని హనుమాన్ ఆలయంలో మరాఠీ భజన పాటలు పాడేవాడు. నాటకాలను చూసి మరాఠీ, హిందీ పాటలపై మక్కువ పెరిగింది. హిందీ పాటలు పాడుతూ స్టార్ మేకర్ యాప్‌లో పెట్టేవాడు. ఆ పాటలు చూసిన కౌటాల మండలం మొగడ్‌దగడ్‌కు చెందిన దివ్యాంగ గాయకుడు కోసన్‌కర్ అనిల్ స్వరం బాగుందని విజయ్‌ను ప్రోత్సహించాడు.

బతుకమ్మ పాటలతో గుర్తింపు..

కౌటాల మండలంలో ఎక్కువ మంది బతుకమ్మ పండగ సందర్భంగా తెలుగు బతుకమ్మ పాట లు పాడుతారు. దీంతో తెలుగులో బతుకమ్మ పాట లు పాడాలని నిర్ణయించుకున్న విజయ్.. మూ డేళ్ల కిత్రం బతుకమ్మ పాటను రాసి మంచిర్యాలలోని స్టూడియోలో రికార్డు చేయించాడు. 'బీవీ ఎస్ మ్యూజిక్' పేరుతో యూట్యూ బ్ చానల్‌ను ప్రారంభించాడు. బతుకమ్మ పాట ను కౌటాల మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో చిత్రీకరించి 'బతుకమ్మ.. ఓ బతుకమ్మ' అనే పాటను య్యూ టూబ్‌లో అప్‌లోడ్ చేశాడు. ఈ పాటకు ఇప్పటివరకు 61 వేల వ్యూస్ రావడం విశేషం. అలాగే 'బయలుదేరే మా బతుకమ్మ' పాటను ప్రాణహి త, పెన్‌గంగ నదుల సమీపంలో పల్లెటూరి వాతావరణంతో షూటింగ్ చేసి యూట్యూబ్‌లో రిలీజ్ చేశారు. అలాగే గతేడాది 'ఉంగురాల జుట్టు దాన' పాట పాడగా.. ఏకంగా 11 లక్షల మంది వీక్షించారు. ప్రస్తుతం ఈ పాట జిల్లాలో ప్రతీ వేడుకలో మారుమోగుతోంది. 'హాఫ్ సారీ కట్టుకుని'.., 'ఓ సారి సూదరాదే పిల్ల..', 'నా గుండెకు గా యం' వంటి పాటలు య్యూటూబ్‌లో మంచి వ్యూస్ సాధించాయి. తాజాగా ఈ నెల 4న 'చి థాయె ఖోరి' సాంగ్ రిలీజ్ చేశారు. స్థానిక యువతకు సైతం పలు అవకాశాలు కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నాడు.

న్యూస్‌రీల్

టీచర్లు అంకితభావంతో పనిచేయాలి



కలెక్టర్‌తో నూతన ఉపాధ్యాయులు

ఆసిఫాబాద్‌అర్బన్: డీఎస్సీ- 2024 ద్వారా నియామకమైన నూతన ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గురువారం పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సత్యనారాయణ ఆధ్వర్యంలో నూతన ఉపాధ్యాయులు కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్ మాట్లాడు తూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమై న బోధన చేస్తూ.. వారి భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగుపెట్టిన వారికి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్‌ను పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మధుకర్, ప్రతినిధులు తిరుపతి, మరియాల ఉదయ్‌బాబు, దేవాజీ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

'భట్టి'ని కలిసిన జిల్లా కాంగ్రెస్ నాయకులు



డిప్యూటీ సీఎం, మంత్రితో జిల్లా నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను గురువారం డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. దసరా శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లేశ్ తదితరులు ఉన్నారు.

సీఎంను కలిసిన ఆత్రం సక్కు



సీఎంకు వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు

ఆసిఫాబాద్‌అర్బన్: హైదరాబాద్‌లో గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సక్కు మాట్లాడుతూ జైనూర్ ఘటనలో బాధితురాలికి రూ.25లక్షల ఆర్థికసాయం అందించడంతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఐటీడీఏల పరిధిలో ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఆదివాసీ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలని కోరారు. దండారీ, పెర్సపేన్, భీమల్‌పేన్, జంగుబాయి, లక్ష్మీదేవర, గాంధారీ ఖిల్లా, కుమురంభీం వర్ధంతి, పూలాజీబాబా, ఇతర మహనీయుల ఉత్సవాలకు నిధులు పెంచాలని విన్నవించారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా కేంద్రంలోని ఆదర్శ గిరిజన క్రీడాపాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు జంగు, జిల్లా ఆశ్రమ పాఠశాలల స్పోర్ట్స్ అధికారి మీనారెడ్డి గురువారం తెలిపారు. రంగారెడ్డి జిల్లా తొర్రూర్‌లో శుక్రవారం నుంచి జరిగే 53వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో సత్యభామ, నందిని, కవిత, అంజలి, ముత్తుబాయి, పల్లవి పాల్గొంటారని అన్నారు. క్రీడాకారులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తరుపున రాణించాలని టీడబ్ల్యూ డీడీ రమాదేవి ఆకాక్షించారు. విద్యార్థినులను ఏసీఎంవో ఉద్దవ్, జీసీడీవో శకుంతల, కోచ్‌లు విద్యాసాగర్, అరవింద్, తిరుమల్, హెచ్‌డబ్ల్యూవో సాయిబాబా అభినందించారు.

పండుగకు వస్తారు.. పరీక్షలు చేస్తారు..

వైద్యం ఈ రోజుల్లో చాలా ఖరీదైంది. నాడి పట్టాలన్నా పైసలు చెల్లించాల్సిందే. అందుకే చాలా మంది ప్రైవేటు వైద్యం అంటేనే జంకుతున్నారు. ఇలాంటి తరుణంలో మంచిర్యాల జిల్లాలో ఓ గ్రామానికి చెందిన వైద్యులు పుట్టిన ఊరి ప్రజలకు ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. ఏటా దసరా సెలవులకు సొంతూరిలో వైద్యశిబిరం నిర్వహిస్తున్నారు.

- వివరాలు 2లో▸

పండుగ పూట.. రైతులకు ఊరట

- ఖాతాలో పంట నష్ట పరిహారం జమ
- ఎకరాకు రూ.10వేల చొప్పున విడుదల చేసిన ప్రభుత్వం
- గత నెలలో వర్షాలతో దెబ్బతిన్న పంటలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దెబ్బతిన్న పంటలు

జిల్లా	ఎకరాలు	రైతులు	నగదు
ఆదిలాబాద్	3,096.03	2,041	రూ. 3,09,60,750
కుమురంభీం	2,692.11	1,374	రూ.2,69,22,750
మంచిర్యాల	598.02	447	రూ.59,80,500

మంచిర్యాలఅగ్రికల్చర్/పెంచికల్‌పేట్: గతనెల మొదటి వారంలో భారీ వర్షాలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పంటలు నీట మునిగాయి. వరదలకు పొలాలు, చేలల్లో ఇసుక మేటలు వేసింది. రోజుల తరబడి చేలల్లో నీరు నిల్వ ఉండడంతో పంటలు కుళ్లిపోయాయి. ఈ క్రమంలో పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. సర్వే చేసి నష్టపోయిన పంటల వివరాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. వ్యవసాయాధికారులు సర్వే చేసి కలెక్టర్ ద్వారా నివేదిక అందించారు. ఈ నివేదిక ఆధారంగా ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం డబ్బులను ప్రభుత్వం బతుకమ్మ పండుగవేళ రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సెప్టెంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు కురిసిన వర్షాలకు పత్తి, సోయా, వరి, కంది పంటలు దెబ్బతిన్నాయి. సర్వే చేసిన అధికారులు సెప్టెంబర్ 10న ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 33 శాతానికిపైగా నష్టపోయిన పంటలను వ్యవసాయ శాఖ పరిగణలోకి తీసుకుని సర్వేలో గుర్తించారు. ఇందులో అధికంగా పత్తి, వరి పంటలకు నష్టం జరిగినట్లు తేల్చారు. ఆదిలాబాద్ జిల్లాలో పెన్‌గంగ పరీవాహక ప్రాంతాలోపాటు తలమడుగు, బోథ్, గాదిగూడ, ఉట్నూర్, తాంసి తదితర 8 మండలాల్లో పత్తి, సోయాబీన్, కంది, మొక్కజొన్న, వరి 3,096.03 ఎకరాల్లో నష్టం జరిగింది. 2,041 మంది బాధిత రైతులకు రూ.3,09,60,750 పరిహారం విడుదల చేసింది. మంచిర్యాల జిల్లాలో చెన్నూర్, జైపూర్, జన్నారం, మంచిర్యాల, హాజీపూర్ మండలాల్లో పత్తి, వరి, కంది పంటలు 598.02 ఎకరాల్లో దెబ్బతిన్నాయి. ఇందుకు 447 మంది రైతులకు రూ.59,80,500 విడుదల చేసింది. ఇక కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రాణహిత, పెన్‌గంగ, పెద్దవాగు నదులు ఉప్పొంగి పంటలు దెబ్బతిన్నాయి. పెద్దవాగు పరీవాహక ప్రాంతాలైన వాంకిడి, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, దహెగాం మండలాల్లో పంటలు వరదల పాలయ్యాయి. అలాగే ప్రాణహిత, పెన్‌గంగ పరీవాహక ప్రాంతాలైన సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్ మండలాల్లో పంటలు నీటమునిగాయి. జిల్లాలో మొత్తం 1,374 మంది రైతులకు చెందిన 2,692 ఎకరాల పత్తి పంట వరదలకు దెబ్బతింది. ఎకరానికి రూ.10వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు రూ.2,69,22,750 విడుదల చేసింది. నిర్మల్ జిల్లాలో 33 శాతానికి మించి నష్టం జరుగకపోవడంతో ఈ జిల్లా రైతులకు ప్రభుత్వం పరిహారం విడుదల చేయలేదు.

నేరుగా రైతుల ఖాతాల్లో జమ

పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం విడుదల చేసింది. జిల్లాలో అర్హులైన 1374 మంది రైతులను గుర్తించాం. వారి ఖాతాల్లో ఎకరానికి రూ.10వేలు చొప్పున నేరుగా జమ చేస్తాం. రెండు, మూడు రోజుల్లో పరిహారం పంపిణీ ప్రక్రియ పూర్తి చేస్తాం. – శ్రీనివాసరావు, డీఏవో, కుమురంభీం ఆసిఫాబాద్

వేతనాలు అందక ఓపీఎస్‌ల పస్తులు!

- ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులకు ఎదురుచూపులు
- మూడు నుంచి ఎనిమిది నెలలుగా వేతనాలు పెండింగ్
- సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని డిమాండ్



పారిశుధ్య పనులు చేయిస్తున్న ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శి

రెబ్బెన(ఆసిఫాబాద్): పల్లెల్లో పాలన సక్రమంగా సాగాలంటే ప్రతీ పంచాయతీకి ఒక కార్యదర్శి ఉండాల్సిందే.. పరిపాలన, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, హరితహారం మొక్కల సంరక్షణ.. ఇలా ప్రతిరోజూ విధులు నిర్వర్తించే ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులకు సక్రమంగా వేతనాలు అందడం లేదు. రాష్ట్రంలో అతిపెద్ద పండగలు బతుకమ్మ, దసరాకు కూడా కుటుంబాన్ని పస్తులు ఉంచాల్సిన దుర్భర పరిస్థితులు ఏర్పడ్డాయి. ఓ వైపు పంచాయతీలకు ప్రభుత్వం అరకొర నిధులు కేటాయిస్తుండగా.. అప్పులు చేసి గ్రామాల నిర్వహణ చూసుకుంటున్న వారిపై అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ప్రభుత్వం నుంచి బడ్జెట్ రాక కొన్ని నెలలు వేతనాలు పెండింగ్‌లో ఉంచారు. వేతనాల బడ్జెట్ వచ్చిన తర్వాత కూడా ఓపీఎస్‌లకు అందించడంలో మరికొన్ని నెలల జాప్యం జరుగుతోంది.

నెలలు గడుస్తున్నా..

జిల్లాలో 15 మండలాల పరిధిలో సుమారు 64 మంది ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. ప్రభుత్వం వీరికి నెలకు సుమారు రూ. 19వేలు చెల్లిస్తోంది. ఇందులో కాంట్రాక్టర్ కమీషన్, జీఎస్టీ, ఈపీఎఫ్, ఈఎస్ఐ కటింగ్‌లు పోగా.. రూ.10,500 వరకు అందుతోంది. రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నా.. ప్రభుత్వం మాత్రం వీరి సేవలకు అరకొర వేతనాలే చెల్లిస్తోంది. అవికూడా ప్రతినెలా క్రమం తప్పకుండా చెల్లించడం లేదు. ప్రస్తుతం జిల్లాలో ఒక్కో ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శికి గరిష్ఠంగా ఎనిమిది నెలల నుంచి వేతనాలు పెండింగ్ ఉన్నాయి. మరికొందరికి మూడు నెలల వేతనాలు పెండింగ్ ఉన్నాయి. నెలల తరబడి జీతాలు అందక కుటుంబాలను పోషించుకునేందుకు ఓపీఎస్‌లు ఇబ్బందులకు గురవుతున్నారు. సర్పంచుల పదవీకాలం పూర్తికావడంతో ప్రభుత్వం జీపీలకు ప్రత్యేకాధికారులను నియమించారు. వారు అంటిముట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో గ్రామాల నిర్వహణ భారమంతా పంచాయతీ కార్యదర్శులపైనే పడుతోంది. ఓ వైపు వేతనాలు రాక అవస్థలు పడుతుండగా.. ఓపీఎస్‌లకు పంచాయతీల నిర్వహణ భారం మరింత భారంగా మారింది. కుటుంబ పోషణ, పంచా యతీల నిర్వహణ కోసం అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేతనాలు అందేలా చూస్తాం

జిల్లాలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులకు కొన్ని నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. మంజూరైన బడ్జెట్‌కు అనుగుణంగా కార్యదర్శులకు వేతనాలు అందేలా చూస్తాం. వేతనాలు అందించడంలో ఎక్కడ జాప్యం జరుగుతుందో తెలుసుకుని చర్యలు తీసుకుంటాం.

– భిక్షపతి, జిల్లా పంచాయతీ అధికారి

సమాన పనికి సమాన వేతనాలేవి..?

ఏ రంగంలో పని చేస్తున్న వారికైనా సమాన పనికి సమాన వేతనం అందించాలని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది. ఓపీఎస్‌లకు మాత్రం ప్రభుత్వం సమాన పనికి సమాన వేతనం అమలు చేయడం లేదు. మల్టీపర్పస్ కార్మికులు, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులకు వేతనాల్లో కొద్దిపాటి తేడా మాత్రమే ఉండటం గమనార్హం. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం వరకు పంచాయతీ కార్యదర్శులు విధుల్లో ఉంటున్నారు. రాత్రిపగలు తేడాలేకుండా పని చేస్తున్నారు. ప్రభుత్వం నిర్వహించే ప్రతీ కార్యక్రమంలో భాగస్వాములు కావాల్సి ఉంటుంది. అలాగే రోజువారీగా చేపట్టే పారిశుధ్యం, తాగునీటి సరాఫరా, పంచాయతీ నిర్వహణ, సమస్యల పరిష్కారం, హరితహారం మొక్కల సంరక్షణ, డ్రై డే యాక్టివిటీలతోపాటు నర్సరీల నిర్వహణ, ఉపాధిహామీ పనుల పర్యవేక్షణ, ఎన్నికల సమయంలో ఓటర్ల జాబితా తయారీ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో లబ్ధిదారుల గుర్తింపు, ఇతర సర్వేలతో క్షణం తీరకలేకుండా గడుపుతున్నారు. ప్రభుత్వం వీరి సేవలకు గుర్తింపు ఇవ్వడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అరకొరగా అందించే వేతనాలు కనీసం పండగల సమయంలోనైనా సక్రమంగా విడుదల చేయాలని ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు కోరుతున్నారు.